ఇష్టంలేదని మీమామగారికి చెప్పి వాళ్ళనిద్దరినీ రానవుసరం లేదని జ్యోతిని తీసుకొచ్చేసెయ్యి. నీ కిష్టంలేని పెళ్ళి చేసినందుకు ఆ కోడల్ని నీ తల్లిదండ్రులే వుంచుకుంటారు.

ఈ ఒప్పందం నువ్వు వింటేనే నీ మాట మేం వింటాం?"

"సరే .. నేనే వెళ్ళి తీసుకువచ్చి ఇక్కడ పారవేసి వెళ్ళి పోతాను. నాకేం భయం లేదు" విసురుగ్గా వెళ్ళి పోయాడు.

ఉత్తరం రాయకుండా రైలు దిగిన అల్లుడికి స్వాగతం యెవరు వెళ్ళి చెప్తారు. పాపం ప్రసాదరావు తలవంచుకుని తన రూములో కూర్చుని యేదో రాసుకుంటున్నాడు. గోపీకృష్ణ స్టేషను గేటుదాటి బైటకి వచ్చేశాడు. ఆపాటికి నోరెండి పోతోంది. ఓ వంద గజాలు నడిచే సరికి తను అంత క్రితం షికారుగా వచ్చి కూర్చున్న చెరువు కన్పించి గబగబా కట్ట దగ్గర కొచ్చి ఒక్కొక్క మెట్టూ దిగుతూ నీళ్ళ వైపు చూశాడు. అది వరకులాగాన నీళ్ళ నిండుగా కలువ పువ్వులు అందంగా వున్నాయి. చల్లటి గాలి అల్లుడని కాబోలు స్వాగతం చెప్పి రివ్వున వెళ్ళిపోయింది. ఆ పరిసరాలని చూస్తూపరవశుడై దాదాపు ఆఖరు మెట్టు మీద రెండు చేతులూ గడ్డం క్రింద పెట్టుకుని ఓ పదహారేళ్ళ అమ్మాయి దీర్ఘంగా ఆలోచిస్తూ తను నీళ్ళ కోసం తెచ్చుకున్న బిందె నీళ్ళ మీద తేలుతూ చెరువులో చాలా లోపలికి వెళ్ళిపోవటం కూడా గమనించకుండా ఆ అందాల బొమ్మ ఆలోచనల్లో తేలిపోతుంది.

వూదారంగు ఆఫ్ వాయిల్ చీరె అదే రంగు జాకెట్టు వేసుకుని తలలో డిశంబరు పువ్వులు పెద్ద మాలగా పెట్టుకుని వూదారంగు గాజులు చేతినిండా వేసుకుంది. తెల్లటి అందమైన శరీరం రంగుకి వూదా రంగు గాజులు భలే అందాన్నిస్తున్నాయి. బెత్తెడు వెడల్పున బారెడు జడ క్రిందకి జారివుంది. చెవులకి మాత్రం ఎర్ర రాళ్ళ జుకీలు సన్నగా వూగుతున్నాయి. నీళ్ళ మీదనించి వచ్చే పిల్లగాలులు ఆ అమ్మాయి ముంగురులని చెదరగొట్టి పోతున్నా ఆ పిల్ల బాహ్య ప్రపంచంలోకి వూడి పడలేదు. బిందెని చూసుకోలేదు.

"అబ్బ! ఏం అందం? ఎవరీ అందాల బొమ్మ." అనుకుంటూ మెల్లిగా నీళ్ళలో దోసిలి కడిగి ఆ పిల్లవైపు మరో సారి చూశాడు. అప్పటి వరకూ బొమ్మలా కూర్చున్న ఆ పిల్లలో కదలిక కల్గి వులిక్కిపడి నీళ్ళు తాగే యువకుడివైపు చూసి వెంటనే లేచి నిలబడింది.

